జనమంచి కామేశ్వరరావుగారు

కన్నె ప్రేమలు

౧

నిరుటికన్న ఈ సంవత్సరం తనశిరము పెరిగి పెద్దదయిందో లేక చికాకుచేత దిమ్మెక్కి పెద్దదైనట్లు తోచిందో కాని, హెన్రీ తేల్చుకొన లేకపోతున్నాడు. అతనిని తలమీది గడ్డిటోపీమాత్రం చెడ్డ చికాకు పెడుతోంది. అది అతని ఫాలభాగాన్ని బిగిసికొని వుండడంచేత, కుట్టడం మొదలుపెట్టి, కణతలలో చిన్న నొప్పిని లేవనెత్తింది.

అలుపుచేత హెన్రీ Third Class పెట్టెలో కెక్కి, టోపీతీసి సామాను కానుగోనికి విసిరేసి, చేతికి ఉన్న Gloves, చేతిపెట్టె, పక్కను పెట్టుకొని కూర్చున్నాడు. రైలుపెట్టె అసహ్యంగా ఉంది. దుర్వాసనలు రేగుతున్నవి. బండి కదలడానికింకా పదినిమిషాలు వ్యవధి. ఎదురుగా Book-stall ఉన్నది. క్రొత్త పుస్తకములు చూడవలెననే కౌతుకంతో అచ్చటికి వెళ్లాడు.

సూర్యకిరణాలు స్టేషను గ్లాసు తలుపులమీద నాట్యమాడుతూ పంచరంగుల రేకల్ని చిమ్ముతున్నాయి. చిన్న కుఱ్ఱాడు సజ్జలో పెట్టుకొని గులాబీల నమ్ముచున్నాడు. ప్లాటుఫారం ఇటూ అటూ పచారు చేయుచున్న స్త్రీపురుషులతో కలకల్లాడుతోంది.

అది వసంతదినం. ఆశుభదినంలో అందరి వదనాలు చల్లని నవ్వువెన్నెలలనే చిమ్ముతున్నవి. వారిదేహములు పసిమివన్నె దాల్చినవి. కంఠస్వరాల్లో మాధురు లొలుకుచున్నవి. లండను పట్టణపు జనులు నవజీవ కళలతో తారాడుచున్నారు. వారి శరీరాల్లో క్రొన్నెత్తురు ప్రవహిస్తున్నది. ఆశాతాండవం చేస్తున్నవి వారి హృదయాలు.

హెన్రీకి పుస్తకములన్న ఆసక్తి. ఐనను అతను చదివిన గ్రంథములే కొద్దిపాటి. పైగా అతని గ్రంథాలయ సర్వస్వమంతేయు అరడజను పుస్తకముల కన్న ఎక్కువుండవు. కాని గ్రంథపఠనాభిలాష కలవాడు కావడంచే ఏపనిమీద ఎక్కడికి వెళ్లినా, పొరుగునున్న పుస్తకాలయమునకు పోయి పుస్తకములు తిరుగవేయడం అతని కలవాటు. అంచేత చదివినా చదవకపోయినా చాల పుస్తకముల పేర్లు అతనికి కంఠస్థము. హెన్రీ విమర్శనదృష్టి కలవాడు. రసజ్ఞుడు. ఏపుస్తకములో ఎంత సత్వమున్నదో అధికారుల ఎదుటనే ఉగ్గడిస్తూ ఉండేవాడు. ఏ క్రొత్తపుస్తకం లభించినా రసవంతమైన ఘట్టాలను ఏర్చికోవడంలో ఉపజ్ఞ కలవాడు.

అచ్చటకూర్చొని ఒకపుస్తకం తీశాడు. అది పద్యకావ్య సంపుటము.

నీమృదుకోమలామలరూప
దర్శనాభిరతిని, పుల్గునయి
రెక్కల దాలిచి, సొక్కి సోలుచు
నీప్రెమోల ప్రాలుదు * * *

ఎందుకో! ఈవ్యర్థ ప్రసంగము
లెందుకో! ఈయూహాపోహాలు
వేడియార్పులె వెచ్చనూర్పుచు
వేచుకొని యుండన్‌-

నీరవయామినీహృదయాన
నియమశూన్యం బయిన నిద్దుర
సద్దులో మృదులోక్తు లాడుచు
నవ్వుకొనుచుందున్‌ * * *

మసక వేకువ కొసరుచూపుల
దెసలకొసలను దివుర జూచుచు
ఇచటనే! ఇచటనే! నీకొఱకె
పేదవడి యుందున్‌.

సుప్త సౌఖ్యము చూరగొనుచూ
స్వప్నమాధురి ననుభవించుచు

అనిలవీచుల కనుల మూయుచు
కలల వెలుంగుదున్.

పై పద్యము చదువుకున్నాడు. మామూలు పద్యాల్లా దాన్ని చదివి వదిలివేయలేకపోయాడు. పదముల కూర్పులో ప్రౌఢిమ లేకపోయినా దాని భావపరిమళ మతన్ని ఆనందింప చేసింది. ఆలోచనలో పడ్డాడు. ఈపద్యముకవి తల్పముమీద పండుకొని, మందపవన కుమారులు మసల్తూ ఉన్నపుడు, సూర్యభగవానుడు లేతకరాలతో అతన్ని లేపుతూంటే స్వప్నావస్థ తొలగిపోతూ, జాగ్రదవస్థ పొందుతూన్నపుడు వ్రాసినట్టుంది. "ఔను. ఇది అంతే అయివుండాలి. ఈపద్యము స్వప్నరూపం పొంది చిరునవ్వు చిలుకుతూ ఉన్నట్టుంది" అనుకున్నాడు హెన్రీ. ఆపద్యముకేసి చూస్తూ, ఏకసంథాగ్రహణము చేయ ప్రయత్నిస్తూ, జ్ఞాపకమునుండి దొర్లిపోయిన మాటలు మల్లి వల్లె వేస్తూంటే ఇంతలో రైలు కూసింది. బుస్సలు కొడుతూన్న పాములా పారిపోతూంటే చూసి 'ఓరిదేవుడా!' అనుకొని పుస్తకం అక్కడ పారేసి పరుగువారాడు. చేతిలో జెండా, ఈలపట్టుకొని పెట్టెమొగదల నిల్చున్నగార్డు ఎగరోజుకొనుచూ వస్తూన్న హెన్రీని దొరకపుచ్చుకున్నాడు.

* * *

హెన్రీ క్రొత్తపెట్టెలో కూర్చున్నాడు. అందులో తనచేతి పెట్టె గాని, టోపీ గాని, Gloves గాని ఏమీ లేవు. కాని తనకెదురుగా ఒకమూల, పెట్టెగోడకు జేర్లబడి కూర్చున్నది. ఒకదివ్యసుందరి, ఆమె అతనికేసి చూస్తున్నదని తెలిసుండీ అతనికిమాత్రం ఆమెకేసి చూడ్డానికి ధైర్యం చాలిందికాదు.

"నే నేదో పిచ్చివాడినని భావిస్తోంది కాబోలు!—రైలులోనికి తోసుకువచ్చిపడ్డందుకు, టోపీయైనా లేకుండా,—అందులోను సాయంసమయాన" అనుకున్నాడు హెన్రీ. తన్ను చూసి తనే నవ్వుకున్నాడు. సరిగాకూర్చుండలేక పోయినాడు. మనస్సులో ఆందోళన రేగింది. దాన్ని ఎల్లాగైనా అణచుకుందామనే ప్రయత్నంలో నిర్లక్ష్యభావాన్ని నటిస్తూ, జేబుల్లో చేతులు పెట్టుకొని, గోడకు ఏదో బొమ్ముంటే దానికేసి చూస్తూ పెదవివిరిచేసి 'బాగాలే' దన్నట్టుగా విసువుతో చికాకు పడ్డాడు. ఇంతసేపూ ఆమె తనకేసి చూస్తూండడం కనిపెట్టి హెన్రీ ఒకచిన్నవాలుచూపు ఆమెమీద ప్రసరింపచేశాడు. చటుక్కున ఆమెమొగము కిటికీవైపు త్రిప్పివేసికొన్నది. ఆమె తళుకారుగళంలో మెరిసింది. ఆగళాన్ని హెన్రీ అదే తేరి పార చూడ్డం మొదలుపెట్టాడు. ఆమె శరీరాంచలములు ముడుచుకొని కిటికీని అంటిపెట్టుకొని కూర్చున్నది. పసిమిరంగు సురగ తరగల్లా అల్లాడుచున్న కేశములు చెక్కిళ్ల పైనుండి భుజములమీదకు పడుతూంటే అల్లాగే కిటికీలోనుంచి పైకి చూస్తోంది. సిల్కు Glove వున్న ఒకచేతిలో చిన్న బొట్టుపెట్టె లాంటిది వుంది తోలుది. దానిమీద ఎడ్నా అని పేరు ఉంది. రెండవ చేతితో కిటికీని పట్టుకున్నది. ఆచేతికి Swiss గడియారముంది. ఆకుపచ్చని కోటు వేసుకున్నది. పువ్వులు ముడిచిన టోపీ ధరించింది. ఆమె ఆకృతి నఖశిఖ పర్యంతము పరిశీలిస్తున్నా అతను ఆపద్య చరణాలని మాత్రము లోలోన పాడుకుంటూనే ఉన్నాడు. "లండనులో ఏదైనా స్కూల్లో చదువుకుంటున్నది గాబోలు! లేకపోతే ఏదైనా ఆఫీసులోపనో" అని ఆమెగురించి తలపోస్తున్నాడు.

ఇంతసేపూ అతన్నెక్కువ ఆకర్షించినవి తరగల్లా జిగ్ జిగ్ మంటూ మెరసే ఆమె కేశములు. ఊరికే అదే తేరిపార వాటికేసి చూడ్డంచేత అతని నేత్రాలు మధువు గ్రోలి మత్తెక్కిన తుమ్మెదల్లా ఉన్నాయి. వాటికి రెప్ప వాల్చు లేదు.

హెన్రీ ఆమెనుగురించి తలపోసుకొంటూ ఉంటూంటే ఆమె ముఖ మటువైపు త్రిప్పింది. ఇద్దరి పరస్పరావలోకనాలు మధ్యే మార్గములోనే, చుంబించుకొన్నవి. అంత ఆమెలో ఆనందం ఉబికింది. అది ముఖం మీద ప్రస్ఫుటమైంది. దాన్ని దాచేద్దామని తల వాల్చికొన్నది. ముఖము త్రపాముగ్ధమైనది. చెక్కిళ్లు కెంపెక్కినవి. ఇదంతా చూసి హెన్రీ, సిగ్గుతో, నవ్వుకున్నాడు.

"మీతో మాటాడాలి, ఆడాలి, ఆడాలి" అంటూ పొరబాటున ప్రక్కనున్నదనుకొని, టోపీమీదకు చెయ్యి

పోనిస్తూ 'అయ్యో' అని తన మందమతికి నవ్వుకున్నాడు. ఆనవ్వు కొంత అతనికి ధైర్యము కూర్చింది.

"క్షంతవ్యుడను. నాకు చాల విచారంగా ఉంది నేను చేసిన అపరాధానికి. మీతోపాటు ఒక్క పెట్టెలో నే కూర్చుని ఇంతసేపూ ప్రయాణం సాగిస్తూ మీకు నే నెందు కంత తొందరగా బండి ఎక్కానో—టోపీయైనా లేకుండా—ఆ సంగతి చెప్పలేక పోయాను. అంత నూతనంగా నేలలోనికి రావడం కొంత ఇబ్బందితో కలసి వుంటుంది. నేను మీకేసి చూస్తున్నాను, క్షమించాలి. నాకు మనుష్యులకేసి తేరి పార చూస్తూ ఉండడ మొకటి అలవాటు. నేను అల్లా మీకేసి చూడ్డం గురించి కాక, నేనంత తొందరగా పెట్టెందు కెక్కానో ఆవిషయం" అంటూ నవ్వుతూ మాట్లాడుచున్నంత సేపూ ఆమె టోపీ కేసి చూస్తూ, "తప్పక చెప్తాను" అన్నాడు.

ఒక నిమిషం సేపు ఆమె మరేమి మాట్లాడలేదు. తరువాత సిగ్గుతో సన్నంగా "మరేమి ఫర్వా లేదండి" అన్నది. రైలు లండను పట్టాపు ఇళ్లూ, ఫ్యాక్టరీ గొట్టాలూ దాటి రంయ్ మని వెళ్లిపోతున్నది. చల్లని గాలి వీస్తూ ఉంది. పొలముగట్లూ, పల్లె ప్రదేశాలు దాటి నడుస్తూ ఉన్నది రైలు. సూర్యాస్తమయము. హెన్రీ యెదలోని రొదలు రైలు టక్ టక్ శబ్దానికి శ్రుతులు వేస్తున్నాయి. హెన్రీకి ఆనిశ్శబ్దం దుర్భరంగా ఉన్నది. ఆమె మూగనోము పట్టిన ముగ్ధకన్యలా కూర్చున్నది. ఆమె ఊరికే కూర్చుని తన గురించి చెడ్డ అపోహలు పెంచుకుంటున్నదేమో! అని భయపడుతూ హెన్రీ తాను అనింద్యుడని ఆమె కార్యముతో తెలియజేయ పూనుకొని ముందుకు వంగి, చేతులు మోకాళ్లకు పెనవేసి మాట్లాడ్డం మొదలు పెట్టాడు: "ఇల్లా చూడండి నేను, నాచేతిపెట్టె అన్నీ Third Class పెట్టెలో పెట్టుకొని ఎదురుగా ఉన్న book stall ఒకసారి చూద్దామని పోయాను" అంటూ తన సొదంతా ఆమెకు చెప్పాడు. హెన్రీ చెప్తూ ఉన్నంత సేపూ ఆమె తలెత్తుకొని వింటున్నది. హెన్రీ ఆమె నీలాల్లాంటి కళ్లు చూస్తూనే చెప్తున్నాడు తన సొదంతా. ఆమె పెదవుల్లోంచి చిరునవ్వుతొంగిచూస్తూ ఉన్నది. "ఓహో! మోహాశిలా! ఎంత ఆనంద దాయినివే నీవు" అంటూ హెన్రీ హృదయం ఆమెను చూస్తూ ఉన్నంతసేపూ పాడుతూనే ఉంది. పాడిపాడి హృదయ ముద్రిక్తమయింది. ఆ ఉద్రేకంలో ఉఛ్వాస నిశ్వాసాలు విడిస్తే ప్రాణా లెగసిపోతాయేమో అనే భయంచేత కొంతసేపు ప్రాణాయామం పట్టాడు హెన్రీ.

"ఆచేతిపెట్టెలో మరేమీ విలువైన వస్తువులు లేవుగదా!" అందామె సన్నగా, గంభీరంగా.

పెదవి విరిచి, "ఏమీ లేవు. ఏవో నేను రాసినవి కొన్ని పిచ్చిపిచ్చి బొమ్మలున్నాయి. ఆఫీసు నుంచి ఇంటికి పట్టుకు పోదామని అందులో పెట్టాను. పోతే పోయినవి......నాటోపీ పోయినందుకు మాత్రం నే తల తడిమి చూసుకుంటూన్నాను. ఇప్పుడు సుఖంగా ఉంది బాబు. అది పెట్టుకున్నంత సేపూ నొక్కి, కుట్టి చెడ బాధపెట్టేది" అన్నాడు హెన్రీ. "అవును. అదిగో పాపం! అక్కడ మచ్చకూడా పడింది" అని అతని ఫాల భాగం కేసి వ్రేలుతో చూపిస్తూ నవ్విందామె. ఓహో! ఆమె అన్నమాట లతన్ని పులకితుణ్ణి చేశాయి. వేరువేరు భావగతులకు లోనయ్యాడు. ఆనందోన్మత్తుని వలె నున్నాడు. కొంతసేపు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు. నిశ్శబ్దం. ఐతే నేమి! నునువెచ్చని గాలుల్ని ఇస్తూ జీవాన్ని పోసే నిశ్శబ్దమది. హెన్రీ ఆనిశ్శబ్దంలో ఎంత ఆనందం అనుభవించాడో! 'అదుగో! పాపం! అక్కడ మచ్చకూడా పడింది' అన్న ఆమెమాటలు వారిద్దరకూ ఒక అపూర్వమైన సంబంధం ఏర్పరిచాయి. ఇప్పుడు వారు నూత్న పరిచితప్రేయసులలా ఉన్నారు. ఆమె ఊరికే ముసిముసి నవ్వులు కురిపిస్తోంది. ఆమె నవ్వు మొదట కళ్లల్లో కనిపించి, ఎవ్వరికీ తెలియకుండా చెక్కిళ్లపైకి బారి, పెదవులపై అట్టె నిలిచి పోతూ ఉంటుంది. హెన్రీ వెనక్కి జేర్లబడ్డాడు.

'ఓహో! జీవితం అమృతం, చిత్రం.' అన్నమాటలు అతని రుద్ధ కంఠాన్ని వీడి, రైలు ఘోష వీడి బైట పడ్డాయి. అంతలో రైలు తొలిచిన కొండల్లోంచి పోతూ ఉన్నది. ఆమె ముందుకు వంగి అతనితో మాట్లాడుతూ ఉంది.

"నే అల్లా అనుకోను. జీవితము నాకమృతం, చిత్రం అనిపించడం లేదు. నాకు జీవితంలో నిరాశ, నిస్పృహ తప్ప మరేమీ లేవు. అందులో కొన్ని నెలలనుంచి నాకు జీవితం వెగటుగా తోస్తోంది" అందామె.

తాత్కాలికంగా పెట్టెనిండా చీకట్లు క్రమ్మాయి. హెన్రీ "ఏమిటి! అల్లా అంటారు" అన్నాడు.

"ఓహో!........." అంటూ ఆమె ముడుచుకొని, నవ్వుతూ తల త్రిప్పేసింది. తానీరైలు రొదలో మాట్లాడలేక పోతున్నానని.

"సరే" అంటూ తలూపి అతను వెనక్కి జేర్లబడ్డాడు. కొంతసేపటికి రైలు కొండల్లోంచి బైటపడింది. అక్కడక్కడ దూరాన్ని దీపాలు, ఇళ్లు కనబడుతున్నాయి. హెన్రీ ఆమె మాట్లాడుతుందేమో అని చూస్తున్నాడు. కాని ఇంతలోను ఆమె లేచి కోటుబొత్తాములు పెట్టుకొని, టోపీ చేతులతో సద్దుకుంటూ ఇటూ అటూ కొద్దిసేపూగి, "నే నిక్కడ దిగిపోతాను" అంది. ఆమె వెళ్లిపోవడమంటే హెన్రీకి చాల కష్టమనిపించింది. రైలు నింపాదిగా స్టేషను చేరుతూ ఉన్నది. పరిసరములోని దీపాలుదగ్గర పడడంచేత కలకల్లాడుతున్నాయి. ఆమె పెట్టె పొడుగునా నడచి తలుపు చేరింది.

"ఇల్లా చూడండి. మళ్లీ మిమ్మల్ని చూడలేనా" అని డగ్గుత్తికతో నంటూ హెన్రీ తానుకూడ లేచి ఒక చేతితో సామాను కానుపట్టుకొని,

"అబ్బా! మళ్లీ మిమ్మల్ని చూడాలండీ" అన్నాడు. బండి ఆగుతున్నది. ఆమె గుక్క తిప్పుకోకుండా, "నేను రోజూ సాయంకాలమప్పుడు లండనునుండి వెళ్లిపోవస్తూంటాను" అంది.

"మీరే! మీరే! మీరే నిజంగా!"

అతని తొందర ఆమెను భయపెట్టింది. దాన్ని ఎంతో అణచివేయాలని ప్రయత్నించాడు. ఇంతలో, ఆమె వెళ్లిపోతున్నది గదా! కరస్పర్శ చేద్దామా? వద్దా? అని అదో సందేహం కలిగింది. రైలు ఆగిపోయింది. ఒకచేతిలో చిన్నపెట్టె ఉంది. రెండవ చేత్తో తలుపు గొళ్లెము పట్టుకొని దిగిందామె. మరి మాటా చూపూ ఏమీ లేకుండానే ఆమె తొందరలో చల్లగా నడచిపోయింది.

౨

శనివా రాదివారాలు. ఆఫీసుకు సెలవురోజులు. సోమవారం సాయంకాలము పగలంతా పనిచేయడంచేత అలపుతో హెన్రీ స్టేషనుకు వచ్చాడు. హెన్రీ ఆఫీసునుండి స్టేషనుకు దారిపట్టుతూ ఉన్నంతసేపూ కొన్ని వెర్రి భావాలతని హృదయాన్ని కలుస్తూ, వెన్నంటి వస్తూనే ఉన్నాయి.

"ఈ బండిమీదే వస్తానని చెప్పలేదే!"

"తీరా నేను బండెక్కడం, ఆమె మరో బండిమీద నా కెదురవడం తటస్థించదు గదా!"

"మరెవరూ ఆమె ప్రక్క నుండరు గదా!"

"నిన్ను గురించే ఈ రెండు రోజులూ తలపోసిందనుకుంటా వెందుకు? పిచ్చిగా!"

"ఆమె కనుపిస్తే ఏమి మాట్లాడుదా మనుకుంటున్నావు?"

చివరకు హెన్రీ ధ్యానగీతి పాడ్డం మొదలుపెట్టి,—

దేవా! దేవా!
నన్నామె కనుసన్న వెలుగులో
మెరసిపోనీ వోయి దేవా! దేవా!

అని దీనంగా పరిశుద్ధాత్మను వేడుకున్నాడు.

స్టేషనులో ఇటూ అటూ జనం నడాడుతున్నారు. బొగ్గు వేసుకున్న ఇంజనులు తెల్లని పొగలను తెరలు తెరల్లా చిమ్ముతున్నాయి. అవి చితికి తెల్లమేఘాల్లా ప్రాకి ఆకాశాని కందాన్ని చేకూరుస్తున్నాయి.

హెన్రీ చాల చికాకుపడ్డాడు. ఆమెజాడేనా కనబడదు. పాపం! మతిభ్రంశం కలిగింది. ఉపశాంతి కోసం కాసేపు కళ్లు మూసుకొని కూర్చుందా మనుకుంటున్నాడు. ఇంతలో ఆమె ఒకచేతితో తోలుపెట్టె పట్టుకొని, మందగమనంతో హెన్రీ ప్రక్కనుంచే రైలు వైపు వెళ్లుతున్నది. హెన్రీ ఆమె గాలి సోకడంతోనే

దిగ్గున మేల్కొని లేచి ఆమెకోసం చూస్తున్నాడు. దగ్గరకు వచ్చి తన్ని పలకరిస్తుందో! లేదో! చూద్దామని.

ఆమె అతన్ని చేరి సిగ్గుతో నింపాదిగా "అవి మళ్లీ దొరికాయా ?" అంది.

"ఆ. నీదయవల్ల — మీదయవల్ల అన్నీ దొరికాయి" అంటూ హెన్రీ నవ్వుతూ, పోయి దొరికిన తన చేతి పెట్టె, gloves ఆమెకు చూపించాడు.

ఇద్దరూ ఒకరిప్రక్కనే ఒకరు నడుస్తూ ఒక ఖాళీపెట్టెలోని కెక్కారు. ఒకరి కెదురుగా ఒకరు కూర్చున్నారు. మాటలు సరిసరి. ముసిముసి నవ్వులు. రైలు కదిలింది. నింపాదిగా స్పీడు హెచ్చింది. రంయ్ మని పోతోంది. హెన్రీ ముందు మాట్లాడ్డం మొదలు పెట్టాడు.

"చాల అన్యాయం సుమీ! నేనింతవరకూ నీపేరు తెలుసుకోకుండా ఉండడం" అన్నాడు. భుజంమీద పడిన కేశములు వెనక్కి సద్దుకుంటూంటే ఎందుచేతనో ఆమెచెయ్యి వణకుతున్నది. అది కనిపెట్టాడు హెన్రీ. బొటనమోపుగా మోకాళ్లు ముడుచుకొని కూర్చున్నది. హెన్రీకూడ అల్లాగే కూర్చున్నాడు. ఇద్దరూకూడ శరీరకంపనాలను అణచిపెట్టుకుందామనే ప్రయత్నంలోనే ఉన్నారు.

అప్పుడామె "నాపేరు ఎడ్నా" అంది. అంత హెన్రీ "నాపేరు హెన్రీ" అన్నాడు.

కొంతసేపు నిశ్శబ్దం వారిసంభాషణను దొంగిలించింది. ఆకాస్తసేపులో వారిద్దరూ ఒకరిపేరు ఒకరు వల్లించుకొని హృదయపేటికల్లో పదిలపరచుకున్నారు.

తల ఒకప్రక్కకు వాల్చి హెన్రీ "మరోసంగతి నిన్నడగాలని వుంది. నీవయస్సెంత ?" అన్నాడు.

"పదహారు దాటాయి. మీకో!" అందామె.

"దగ్గరగా నాకు పద్ధెనిమి దుంటాయి" అన్నాడు.

"అబ్బా, చాల వేడిగా ఉందే" అంటూ ఆమె చేతుల కున్న gloves తీసేసి చేతుల్లో చెంప లెట్టుకుంది.

ఇప్పుడు వారినేత్రములు వెరపును చూపడం మానివేశాయి. ఒకరి నొకరు నిర్భయంగా చూసుకుంటూ కూర్చున్నారు. కాని వారిశరీరాలు మాత్రం కంపితమౌతూనే ఉన్నాయి. ముందుకు జారి బంగారపు సరిగంచులా తళతళలాడే ఆమెకేశములు ముఖాన్ని సగం కప్పుతున్నాయి.

"నీ వింతకు ముం దెవరినైనా ప్రేమించావా" అంది ఎడ్నా.

"ఎప్పుడూ లేదు. నువ్వు ?" అన్నాడు హెన్రీ.

"నా జీవితంలో ఎప్పుడూ లేదు." అంటూ తల త్రిప్పివేస్తూ, "అదెప్పటికీ వీలుకూడ కాదనుకునేదాన్ని" అందికూడాను. హెన్రీ మాట్లాడ్డం మొదటపెట్టాడు. మాటలు ఝరీవేగంతో పొరలుతున్నాయి.

"అయితే నువ్వు మొన్న శుక్రవారంనుంచీ ఏమి చేస్తున్నావు. శనివారాదివారాలు. ఇవ్వేళ ఇంతవరకూ ఏమి చేస్తున్నావు చెప్పవూ?" అన్నాడు హెన్రీ.

ఆ ప్రశ్నలకు సమాధానమే లేదు. తలమాత్రం ఆడించి నవ్వుతూ, "ఉహుఁ. నువ్వు ముందు చెప్పు" అంది.

"నేనా ?" అంటూ హెన్రీ తానుకూడా చెప్పలే ననుకున్నాడు. దుర్భరక్లేశంతో ఈదుకొనివచ్చిన ఆవిరహవారిధి మళ్లీ దాటడం ఎల్లాగ ? అనిపించింది.

"అబ్బా! నే నేమీ చెప్పలేను" అంటూ తల త్రిప్పేశాడు. కాని నవ్వుతో వెలుగుతూ ఉన్న ముఖంతో "కాని అదంతా బాధ. దుర్భర సంతాపం" అని మాత్రం అనగలిగినాడు.

అంత ఎడ్నా చెంపలనుంచి చేతులు తీసేసి గలగలా నవ్వడం మొదలు పెట్టింది. హెన్రీ కూడ నవ్వ మొదలు పెట్టాడు. ఇద్దరూ ఆయాసం వచ్చినదాకా నవ్వారు.

"ఓహో! నే నేం జెప్పను. అంత ఒక్కక్షణంలో నాలో ఒక అపూర్వ భావ ముదయించింది. నీవు నాకిప్పుడు చిరపరిచితుడుళ్లా అనిపిస్తున్నావు హెన్రీ!" అంది ఎడ్నా.

"నిజం. నాకూ అల్లాగే అనిపిస్తోంది. ఇప్పుడు నాకు వసంతోదయమైనట్లుంది. పట్టురెక్కలపురుగేదో లోపలికి దూరి తనరెక్కలతో వీవనలు వేస్తూఉన్నట్టుగా, చూడు నాహృదయం ఎల్లా కొట్టుకుంటూ ఉందో" అంటూ హెన్రీ తనహృదయంమీద చెయ్యి వేసుకున్నాడు.

"అందులోను ఎక్కువ ఆశ్చర్యమైన విషయమేమిటంటే, నేనెప్పుడూ మొగవారిని లెక్కచేయకూడదని నిశ్చయించుకున్నాను. తక్కిన కాలేజీపిల్లల్లా ఉండకూడదని. అటువంటిది..." అంది ఎడ్నా.

"అయితే నువ్వు కాలేజీలో చదువుతున్నావా"?

ఆమె విసుగుతో తలూపుతూ, "ఏదో ట్రేనింగు కాలేజిలో సెక్రటరీ పని నేర్చుకుంటున్నాను" అన్నది.

"నేనొక శిల్పకారుని ఆఫీసులో పనిచేస్తున్నాను. నూటముప్ఫైమె ళ్లైక్కాలి మా ఆఫీసుకు. ఆకాశమంత ఎత్తు పెరిగిన చెట్లమీద కట్టుకునే పక్షులగూడులా గుంటుంది" అన్నాడు హెన్రీ.

"నీ కాపని ఇష్టమేనా ?" అంది ఎడ్నా.

"నాకిష్టము లేనిపనే! నాకసలే, పనేమి చేయాలని ఉండదు. నీకో!" అన్నాడు హెన్రీ.

"నాకు మరింత అసహ్యం. మా అమ్మ ఏమని పోతుందో అని చేరాను కాని, ఆ కాలేజిలో నా కా చదువంటే సుతలాము ఇష్టము లేదు" అంది ఎడ్నా.

ఆమె సహజ ధోరణిని హెన్రీతో మనసిచ్చి తన కష్టసుఖాలు చెప్తూంటే, "నిజమే! అల్లాగే!" అంటూ అతను సంపూర్ణ సానుభూతిని చూపిస్తూవచ్చాడు.

"నేనూ, మా అమ్మా చాలా విషయాల్లో భావైక్యత కలిగి ఉంటాము. కాని మా నాన్నకూ నాకూ ఒక్క విషయంలోనూ పోలిక లేదు. పాపం! ఆయన అదో మోస్తరు మనిషి. ఒకరి జోలీ సొంటీ అక్కర్లేదు. కాని మా అమ్మలో మాత్రం వీర రక్తం పారుతూ ఉంటుంది. ఆ వీర రక్తమే నాలోకూడ అప్పుడప్పుడు ఉబుకుతూ ఉంటుంది. ఈ బ్రతుకు నేనెంత అసహ్యించుకుంటానో మాఅమ్మకూడ అంతే" అంటూ కొంతసేపు ఆగి, ఒకమోస్తరుకోపంతో "ఏమైతే నేమి? నాకింట్లో ఎవళ్లతోటీ పడదు. ఇది నీకేమి వింతగా లేదు కదా! ఎంతసందడిగా మాయిల్లు ఉంటూన్నా నేను ఏకాకినయే ఉంటూంటాను."

హెన్రీ ఏదో ఊకొడుతున్నాడు, ఆమె చెప్తూ ఉన్నది గదా అని. కాని అతని మన సంతా వేరేచోట ఉంది. ఆమె నొకటి కోరాడు, చాల సిగ్గుతో: "ఒకసారి! ఒకసారి నీ టోపీ తీస్తావూ" అన్నాడు ఆమె ఉలిక్కిపడింది.

"నాటోపీయే! తీసెయ్యమంటున్నావు" అన్నది.

"అవును. నీ వేణిక. ఒకసారి నీ చెరిగిన కురులు పైకి తీసుకో. చూడాలని ఉంది" అన్నాడు.

ఆమె "ఊహుఁ" అంటూ, "నా వేణి కేమి బాగుంది?" అని నవ్వుతూ టోపీ తీసేసి తల ఒకసారి ఎగరేసి, ముందుకు పడిన పెన్నెరులు వెనక్కి లాక్కున్నది.

"ఓహో! ఎడ్నా! నీకేశపవిత్రత, సుందరత గురించి ఏమనను? ప్రపంచంలో నా కన్నిటికన్న ఆ౧ం దాన్ని కూర్చేవి నీకురులే" అన్నాడు హెన్రీ.

ఆనందంతో నవ్వుతూ ఆమె "అంత అందంగా ఉందా నా తలకట్టు" అంది.

పొడువై, మృదువై డాకురేకులా మెరుస్తూ భుజాలమీదకు జారిన ఆమెకేశములు ఒకమోస్తరు కోసుగా ఉండే మేరుగిరి శిఖరాకృతిని పొంది ఉన్నాయి.

"నా జుట్టు రంగు చూచి సాధారణంగా నవ్వనివారుండరు. అటువంటిది నీ కెల్లా నచ్చిందో నా కర్థమవడం లేదు." అంది ఎడ్నా. హెన్రీ ఆమెమాటలు నమ్మలేదు. మోచేతులు మోకాళ్లమీద కానుకొని, అరచేతుల్లో బుగ్గల నిముడ్చుకొని రోషారుణవదనయై ముందుకు కూర్చొని, "నా కెప్పుడైనా కోపం వచ్చి లోలోన కుములుతూ ఉన్నప్పుడు నే నిల్లాగే కూర్చుంటాను. ఇల్లా అంటూంటే నీకు నవ్వులాటలుగా ఉందేమిటి" అన్నది ఎడ్నా. "నీమోస్తరది కాబోలు! ప్రపంచంలో జరుగుతూండే దా

ఋణభీషణ కార్యాలన్నిటిమీద ఏవగింపు చూపించడానికి నీచేతిలో నున్న ఆయుధ మదికాబోలు, అనుకుంటున్నాను గాని నే నెప్పుడూ మరోలా అనుకోను. ఛా! ఛా!" అన్నాడు హెన్రీ.

"అవును. ఇది నీ కెల్లా తెలిసింది? ఈనిజం నీ వెల్లా గ్రహించావు?"

"ఓరిదేవుడా! ఇంతమాత్రం తెలుసుకోలే ననుకున్నావా? మన మిక్కడే ఉన్నాము. ఒకరి నొకరు చూసుకుంటున్నాము. ఇంతే! అనుకున్నావా? కాదు. మనం ఒకరి నొకరు తెలుసుకున్నాము. మనం ఇంతవరకూ అమాయికంగానే జీవయాత్ర చేస్తున్నాము. కాని ఇంతలో ఏదో ఒక అమేయ శక్తి మన మిద్దరమూ బాల్యావస్థ దాటలేదని తెలిసికొన్నది కాబోలు! మనలను ఒక్కదరికి చేర్చింది. అంతేనా?"

"నిజం. నిజం. నేనుకూడ ఇల్లాగే అనుకుంటున్నాను" అందామె చాల ఆత్రంతో.

"మనుష్యులు నియమించే నియమాలవల్లే ప్రపంచం ఇల్లా వుంది. ఎప్పుడైతే నీవీ మానవ శాసనాలనుండి విడివడి స్వేచ్ఛగా ఉంటావో అప్పుడే నీకు సుఖ ముంది. నీజీవితం అప్పుడు అమృతమయం అవుతుంది" అన్నాడు హెన్రీ.

"ఈవిషయాల గురించి నేను చాల తీవ్రంగా ఆలోచించాను."

"ఐతే నువ్వుకూడ నాలాగే ఉన్నావన్నమాట!" అంటూ ఆశ్చర్యంతో లోతు తెలియని నవ్వు కోనేటిలో మునిగిపోయాడు హెన్రీ. కొంతసేపటికి తెప్పిరిల్లి, "నిజంగా మన మిద్దరమే అనుకుంటాను, ఈవిశాల విశ్వంలో, జీవితంగురించి ఇంత తీవ్రంగా ఆలోచించేది. నే నెవరికీ అర్థమవను. నాకు నేనే ఏదో వింతలోకంలో బ్రతుకుతున్నా ననిపిస్తూ ఉంటుంది. నీకో?" అన్నాడు.

"నాకూ ఎప్పుడూ అంతే. అల్లాగే అనిపిస్తుంది" అంది ఎడ్నా.

"మళ్లీ రైలు ఆకొండలోయలోనికి వచ్చేస్తున్నది ఒక్కనిమిషంలో. అందుచేత ఎడ్నా! ఒకసారి నీవేణిక ముట్ట నివ్వవూ?" అన్నాడు హెన్రీ.

చటుక్కున ఆమె వెనక్కు జేర్లపడింది.

"ఉహుం. అదిమాత్రం వల్లగాదు" అంటూంటే ఇంతలో రైలు లోయలోంచి పోతున్నది. చీకటి ఆవరించింది పెట్టెనంతా. ఎడ్నా చల్లగా బాగా వెనక్కి జరిగి పోయింది.

3

"ఎడ్నా! నేను టిక్కెట్లు పుచ్చుకున్నా. నే నింత డబ్బు పెట్టి టిక్కెట్లు ఎల్లా కొనగలిగానో! అనిమాత్రం సంగీతభవనంలోని బుకింగ్‌క్లర్కు తెల్లబోలేదులే! సంగీతసభ అయిపోయిన తరువాత నన్ను గేటు దగ్గర కలుసుకో. అబ్బా! ఆసిల్కురుమాలు మేలి ముసుగు వేసుకొని, ఆముత్యాలహారం మెడలో వేసుకుందూ! ఎంతో ముద్దు వస్తూ ఉంటావు. ఉత్తరాలు నీకు కాలేజికి వ్రాయడం నా కిష్టములేదు. కాలేజిలోని పిల్లలు మనప్రణయ రహస్యాలు బైట పెడతారేమో! అని నా బెంగ. బైటపెడితేమాత్రం మనకి భయమేమిటి? ఏమంటావు చిట్టీ! నువ్వు ఎల్లాగైనా ఆదివారం రాగలవా? ఆఫీసులో ఉన్న నీస్నేహితురాండ్రను కలుసుకోడానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పు. తరువాత మన మెక్కడో సంకేతస్థలంలో కలుద్దాము. ఎడ్నా! అబ్బా! నిన్నే! నిన్నే ప్రేమిస్తా. నీవు లేకపోతే ఆదివారాలు గడపడం దుర్భరం. ఆదివారం తప్పకుండా రావాలిసుమా! 'టీ ఎక్కడైనా పుచ్చుకుంటావేమో! వద్దుసుమా: తప్పకుండా రావాలి. చిట్టీ! నేను వెళ్లి వస్తాను."

"తప్పకుండా నేను వస్తానుగా హెన్రీ! నేను శనివారమే వస్తాను. ఆదివారం కూడ ఉండిపోవడానికి ప్రయత్నిస్తాను. ఇంట్లో నాకెంతో స్వేచ్ఛ. నేనిప్పుడే తోటలోంచి వస్తున్నాను. ఈవేళ సాయంకాలమంతా అక్కడే చాల హాయిగా గడిపాను. హెన్రీ, నాకు మనసారగా కూర్చొని ఏడ్చివేయాలని ఉంది. నిన్నీ రాత్రికి వదల్లేను. నేను కుర్రతనంగా అంటున్నానేమిటి? నాతో ఏది

వచ్చినా కష్టమే హెన్రీ! సుఖంగా ఉంటే అదే నవ్వివేయడం, విచారంగా వుంటే అదే ఏడ్చివేయడం. మనం ఎంతో చిన్నపిల్లలమైనా ఒకళ్ల నొకళ్లం గ్రహించుకున్నాం కదూ? నీ వింకో క్షణమైనా ఇక్కడుంటే బాగుండుననిపిస్తోంది. గుడ్ నైట్ రాజా! సెలవు. నేను వెళ్లి వస్తాను."

౪

"ఆ. ఆ. ఇక్కడ బాగానే ఉంది. సుఖంగానే కూర్చున్నా. అదృష్టమువల్ల హంగైనచోటే దొరికింది" అంటూ ఎడ్నా తనకోటు తీసుకుంటూ నుంచుంది. హెన్రీ ఆమెకోటు తీసిపెట్టడానికి కామెను చేరాడు.

"నీ కెందుకు శ్రమ. అయిపోయిందిలే. నేనే తీసుకున్నాను" అంటూ కోటు తన సీటులో వేసుకొని దాని మీద కూర్చున్నది. హెన్రీకూడ ఆమె ప్రక్కనే కూర్చున్నాడు.

"హెన్రీ! అవేమిటి నీచేతులోవి. పువ్వులా?"

"ఆ. రెండు గులాబీలు. చిన్నవి" అంటూ అవి ఆమె ఒళ్లో పడేశాడు హెన్రీ.

"నా ఉత్తరం జాగ్రత్తగా అందుకున్నావా" అంటూ ఏవో కాగితాలకున్న పిన్ను తీస్తోంది ఎడ్నా.

"ఆ. అందింది."

ముంగురులు వెనక్కి తీసుకుంటూ హెన్రీని ప్రోగ్రాం కాగితం ఇమ్మని అడిగింది.

"ఇదిగో! నువ్వు నేను కలసి చదువుదాం. నేను పట్టుకుంటాను నువ్వు చదువుదు గాని" అన్నాడు హెన్రీ.

"ఊహుం. అది నా కిచ్చేయి. నా క్కావాలి."

"ఐతే నేను చదువుతాను. నువ్వు విను."

"తరువాత నువ్వు చదువుకుందు గాని. ముందు నా కియ్యి."

"అబ్బా! ఏమిటి ఎడ్నా!" అన్నాడు హెన్రీ నెమ్మదిగా.

"అబ్బా! ఇక్కడ వద్దు బాబూ! చాల మంది జనం ఉన్నారు" అంది ఎడ్నా.

హెన్రీకి ఆమెను ముట్టుకోవాలని బుద్ధి పుట్టడ మెందుకు? దాని కామె అంత అభ్యంతర పెట్టడ మెందుకు? ఎప్పుడు వాళ్లిద్దరు కలిసినా హెన్రీ కామెను ముట్టుకోవాలనీ, చేయిచేయి కలుపుగుంటూ పొలము గట్టున హాయిగా చల్లగాలిలో ఆమెతో షికారు చెయ్యాలనీ ఉంటుంది. పాపం! అతని కామెమీద భుజము భుజము తగిలేటట్టుగా వాలుతూ నడవాలని ఉంటుంది. అదేమో కాని ఇతను దగ్గరకు వెళ్లినకొద్దీ ఆమె వెనక్కి తగ్గుతూ, తారుచూ, నన్ను ముట్టుకోకోయ్! అన్నట్టుగా వెళ్లిపోతూ వస్తూ ఉంటుంది. ఆమె దూరంగా ఉన్నంతసేపూ హెన్రీ హృదయం ఆమెసమాగమంకోసం దుర్భరంగా పరితపించి పోతూఉంటుంది. ఎడ్నా ప్రక్కనుంటే ఆమె ఊర్పులు మందమలయానిలాలై హెన్రీ ఆర్ద్రహృదయానికి శమనంగా వీవనలు వేసినట్టే ఉంటుంది. కాని అతని కా అదృష్టము పట్టలేదు. ఎప్పుడూ ఆమె అతన్ని తాకని వ్వలేదు. కాని ఆమెకుమాత్రం అతని యందు నిబిడరక్తి అని అతనికీ తెలుసు. అటువంటప్పుడు అతనామె కరస్పర్శ చేయవలెనని ఉద్యుక్తుడైనప్పుడల్లా ఆమె వెనక్కి జంకిపోవడ మెందుకు? ముట్టుకుందామని ఆమెను చేరినప్పుడల్లా ఎడ్నా బాధను వెలువరిస్తూ దీనంగా నేత్రదృష్టి క్రిందకు జార్చేది. వారిద్దరునూ, ప్రేమావగుంఠనము జార్చుకొని, పరస్పరావలోకనాల్లో కళ్లు కౌగిలించుకొని, ఆనంద బాష్పాలు జాలువారుస్తూ ప్రణయ రహస్యాలు మాట్లాడుతూ, యుగయుగాలు గడిపివేయగలరు. ముట్టుకోవడానికి మాత్రం ఆమె హెన్రీమీద ఆంక్ష పెట్టింది. ఇంతెందుకు! ఆమె కోటు తీసి పెట్టడానికైనా అతనికి చనువిచ్చింది కాదు.

ఆమె వింత చెయిదములు, ప్రేమ తొణికిసలారే జిలిబిలిమాటల ధోరణి అతన్ని భావముగ్ధుణ్ణి చేశాయి.

"హెన్రీ!" అని ఆమె అనడంతోనే అతను ముందుకు వ్రాలాడు. అతని అధరములు రెండూ ఆలింగనం చేసుకున్నాయి.

"నీకో సంగతి చెప్పాలని ఉంది. గానసభ అయిన తరువాత చెప్తాను. తప్పకుండా చెప్తుతానే" అన్నాడు హెన్రీ.

"సరే!"

కాని అత నింకా మనోవ్యథలు చెందుతూనే ఉన్నాడు.

"అల్లా విచారంగా ఉన్నా వేమి?" అందామె.

అతను తల త్రిప్పివేశాడు, లే దన్నట్టుగా.

"కాదు హెన్రీ. నువ్విల్లాగో ఉన్నావు."

"లేదు. నిజంగా లేదు." ఆమెచేతుల్లో పడిఉన్న గులాబీలకేసి చూస్తున్నాడు.

"ఐతే నువ్వు ఆనందంగా ఉన్నావా?"

"ఆహా! విను. గానసభ ప్రారంభ మవుతున్నది" అని ఆమెమాటల ధోరణి త్రిప్పేశాడు హెన్రీ.

గాన సభ ముగిసేటప్పటికి కను చీకటిగా ఉంది. నీలిరంగు వెలుతురు వీథులను, ఇండ్లను ముసిరింది. రంగు మేఘాలు వెల్లకొండమీద తేల్తూ ఈదుకొని వస్తూ ఉన్నాయి. ఎడ్నా పరిచయమైన తరువాత ప్రథమ పర్యాయము ఇవ్వేళనే అతని హృదయం బరువెక్కింది.

"హెన్రీ!" అని కేకవేసి అతనికేసి తేరిపార చూస్తూ ఉంది ఎడ్నా.

"హెన్రీ! నేను నీతో స్టేషనుకు రాదలచుకొన లేదు. నాకోసం చూస్తున్నావా యేమిటి? వద్దు. వద్దు. నేను రాను. నన్ను విడిచిపో బాబూ!"

"ఓరి దేవుడా!" అంటూ ఆశ్చర్యంతో, "నే నేం చేశాను? నువ్విల్లా గున్నావేమమ్మా ఎడ్నా? చెప్పవూ" అన్నాడు.

"ఏమీ లేదు. నువ్వు వెళ్లిపో!" అంటూ ఆమె వెనక్కి తిరిగి ప్రక్కవీథిలోకి పారిపోయి లాంతరు స్తంభానికి జేర్లబడి చేతులతో మొగము కప్పుకొన్నది.

"ఎడ్నా! ఎడ్నా! నావెర్రికుట్టీ. అదేమిటి? ఏడుస్తున్నావా? అయ్యో! వెర్రికుట్టీ! ఏమి? ఏమి?"

చేతులతో స్తంభానికి ఆనుకొని వెక్కివెక్కి వెర్రిగా ఏడుస్తోంది ఎడ్నా.

"ఎడ్నా! ఏడవకమ్మా. తప్పంతా నాదే. నేను పట్టిమూర్ఖుణ్ణి. తెలివి మాలినవాణ్ణి. నీ విరామకాల మంతా పాడుచేశాను. నా తెలివితక్కువ ప్రవర్తనతో నిన్ను చాల క్షోభపెట్టాను. అదే కారణం కదూ? క్షమించు. క్షమించు."

కన్నీళ్లు తుడుచుకుంటూ, "అబ్బా! అది కాదు హెన్రీ! నీమనస్సు నాకోరకై క్షోభించడం నాకు చాల అసహ్యంగా ఉంది. ఎప్పుడు నువ్వు నన్ను...నన్ను...ముట్టుకుందా మనుకున్నా...ముద్దు...పెట్టుకుందా మనుకున్నా ...నేను నిన్ను అడ్డుపెట్టడం తలచుకుంటే నన్ను నేనే కోసేసుకుందా మనిపిస్తున్నది. నాకు నేనే అర్థము వడం లేదు. ఏమిటో! ఎందుకో అల్లా నే అడ్డుపెట్టడం? నీ వంటే భయంవల్ల కాదుసుమా! నీ వంటే నాకు భయం కూడా లేదు. అబ్బా! నీజేబురుమా లేదీ!" అనడంతోనే జేబులోంచి రుమాలు తీసి ఎడ్నా కిచ్చాడు హెన్రీ.

"సంగీతసభ అవుతూ ఉన్నంతసేపూ ఈవిపరీత భావముగురించి సంశయాలు నన్ను కలగిస్తూనే ఉన్నాయి. ఎప్పుడు మనం కలుసుకున్నా దీని గురించి ప్రసంగిస్తామని నాకు తెలుసును. ఎంచేతనో కాని మనం ఒకసారి అది చేశామంటే—ఏదో నీకు తెలుసునుగా—చేయి చేయి కలుపుకొని ముద్దుపెట్టుకుంటే—అబ్బా! అంతా మారిపోతుంది హెన్రీ! ఇప్పుడున్నంత స్వేచ్ఛగా ఉండలేమేమో! ఏదో రహస్యమైనపని చేసిన వాళ్లమవుతాము. మన మింక చిన్నపిల్లల్లా ఉండము. కాదూ? నవ్వుతున్నావా నావెకిలితనం చూచి? అప్పుడింక నేను వెకిలినైపోతాను. సిగ్గు ఎక్కువౌతుంది. నువ్వు నేను, నేను నువ్వు కాబట్టి మన కటువంటివి వద్దు హెన్రీ!" అంటూ ఎడ్నా అతనికేసి తిరిగి అతన్ని గట్టిగా చూస్తూ తన అలవాటు ప్రకారం చేతులతో బుగ్గలు నొక్కుకున్నది. ఆమెకు వెనక తట్టున ఆకాశముమీద మసక కన్నేసుకొని చంద్రుడున్నాడు ప్రకృతి తొడిగిన మొగ్గలు చంద్రుని కౌగిలిలో ఉండడంచేత విడవనే లేదు. అల్లా నిలుచుని అతను ప్రోగ్రాం కాగితం ఊరికే మెలిపెడుతున్నాడు.

"హెన్రీ! నేనిప్పుడైనా నీకర్థమయానా ఏమిటి చెప్పు" అంది ఎడ్నా.

"ఆ. అర్థమయావనుకుంటున్నాను. కాని నేనంటే, చెప్పు, ఇంక నీవు భయపడవుకదూ!" అంటూ నవ్వబోయాడు

"మనము అదంతా మరచిపోదాము. దాన్ని గురించి మరి తలపెట్టవద్దు ఈ విషాదగాథ మన ప్రణయ ప్రబంధములోనుంచి తుడిచివేదాము. ఏమంటావు?" అంటూ అతని ముఖవిలాసాలు పరిశీలిస్తూ.

"ఈసంగతి విన్నతరువాత నన్ను ప్రేమించడం తగ్గిపోతుందా ఏమిటి హెన్రీ! నీకు" అందామె.

"ఛా! ఛా! ఈ ప్రపంచంలో ఏదీకూడ నాకు నీయందున్న ప్రేమను తగ్గించలేదు. ఎవ్వరితరమూ కాదు మన ప్రేమప్రవాహాన్ని అరికట్టడానికి కాని, దానికి ఆనకట్ట వేయడానికి కాని" అన్నాడు హెన్రీ! ఆమాటల్లో పవిత్రత వెల్లివిరిసింది. ఉత్సాహం. ఉద్రేకం పొంగి పొరలింది.

※

లండను వారిక్రీడాస్థలమయింది. సెలవురోజుల్లో మట్టమధ్యాహ్నమనగా బయలుదేరి అదే తిరిగేశేవారు. క్రొత్తదారులు కనిపెట్టేవారు. తిరిగి తిరిగి వారు షమంగా వాళ్ల ఊరులాంటి ఊరునే చేరుకున్నారు. అక్కడిషాపులూ, మిఠాయిఅంగడులూ, టీక్లబ్బులూ, వీధులూ అన్నీ కూడ వాళ్ల ఊరునే పోలిఉన్నాయి. కాని ఆ ఊరుపేరు కొంత వింతగా ఉంది. ఊరుపేరు క్రొత్తగాను, వింతగాను ఉండడంచేత ఆ ఊళ్లో ఉండిపోదామని వారికి కౌతుకం పుట్టింది.

ఆ ఊరులో చాలనుంది సముద్రముమీద ఓడల్లో పనిచేసి చీకిపోయిన ఓడమల్లయ్యలు. నేలబారుయిళ్లు. ఊరుచుట్టూ నీరు ప్రవహిస్తూఉంది. ఈ ఓడమల్లయ్యలందరూ చేతికర్రలు దగ్గర పెట్టుకొని వాకిట కూర్చొని ఇళ్లు కాపలా కాస్తూ ఉంటారు.

వీరు ఆ ఊరు చేరుకునేటప్పటికి చీకటిపడిపోయింది. అంచేత ఆఊరి ప్రజలను, ఊరివింతలను చూడడానికి వీలు లేకపోయింది. నది, దాని పరిసరములో ఉన్న ఇళ్లూ, షాపులూ వాటిలో వెలుగుతూన్నదీపాలు మాత్రమే కన్నులు కరవు దీరా చూచారు. ఒక ఇంట్లో కుట్టుమిషనుమీద పనిచేసుకుంటున్నది ఒక స్త్రీ. మిషను చప్పుడుబట్టీ, దీపంతల్ల గోడమీదపడ్డ ఆమె నీడనుబట్టీ, ఆమెను పోల్చుకోగలిగారు వీరిద్దరూ. "ఓ. ఈఇల్లు ఎక్కువ పరిశుభ్రమైన ప్రదేశంకూడాను" అన్నాడు హెన్రీ.

ఇళ్లు చిన్నవైనా వాటిచుట్టూ పూలతీగెలున్నాయి. ఇంటిముందర నీలిపందిళ్లు. కొన్ని ఎత్తుగున్నాయి ఎక్కడానికి కర్రమెట్లు వేశారు. ఇళ్లన్నీ కూడ రాజవీథిని అంటిపెట్టుకొని వరుసగా తీరిఉన్నాయి. రోడ్డు కవతలివైపున నది, నదిగట్టు, గట్టుక్రిందను షికారుపోవడానికి చక్కనికాలిబాట, బాట కిరుప్రక్కలా గుబురుగా సీమచింతమొక్కలూ పెరిగి ఉన్నాయి. మధ్యమధ్యను 'ఓకు' వృక్షాలున్నాయి.

"ఈ ప్రదేశం చాల మనోహరంగా ఉంది. పైగా ఇక్కడ అద్దెకో యిల్లుకూడాఉంది. మనం జాగుచేయక ఈ ఇల్లు అద్దెకు పుచ్చుకొని ఇందులో వుందామా?" అన్నాడు హెన్రీ.

"హాయి. ఇక్కడుంటే మన కింకేమి కావాలి? ఎంచక్కా ఉంటుంది" అంది ఎడ్నా ముద్దుగా.

ఇద్దరూ కలిసి ఒకచెట్టుకు జేర్లబడి ఉండబోయే యింటికేసి నవ్వుతూ చూస్తున్నారు.

"ఇంటికి వెనకతట్టున చిన్నతోటకూడా ఉంది. ఇంకేం! పచ్చని తివాసిలాంటి శాద్వలస్థలమూ, గోడకు ప్రాకుతూన్న పూలతీవలూ, గుబురుగా పెరిగిన జుట్లతో చిన్నచిన్న చెట్లూ, దొడ్డీ-అంతా బాగనే ఉంది. రాత్రి అయితే నక్షత్రాలు ఆచెట్ల సందులనుంచి చూస్తూఉంటే ప్రమిదల్లో వెలుగుతూన్న చిన్నచిన్న దీపాల్లా ఉంటాయి కదూ ఎడ్నా! ఇంటిలోపలి భాగంకూడ బాగానే ఉంది సుమా! మేడక్రింద రెండుగదులున్నాయి. పైన పెద్దగది. గదిపైన చిన్నడాబాకూడా ఉంది. వంటగది

మాత్రం చాల చిన్నది. చీకటి కూడాను. చీకటంటే నీకు భయం కాదూ ఎడ్నా?"

"హెన్రీ! ఏమి అనుకోక ఒకసారి దీపం చూపిస్తావూ? 'యూఫిమియా' నిప్పంతా బాగా ఆర్పేసిందో లేదో వంటింట్లోకి వెళ్లి చూచి వస్తాను" అంది ఎడ్నా.

"హాయి! మన పడకగది బాగా ఉంది. రెండు కిటికీలున్న మేడమీది పెద్దగదే కదూ? ఎంతో బాగా ఉంది. గదిలో ఉంటూన్నప్పుడు నిశ్శబ్దంలో నది పాడే చిరుపాటలు వినపడుతూ ఉంటాయి కూడాను. సంగీతపు చెట్లు ఝుంఝుం శబ్దం మనం నిద్రలో కలలు కంటూ ఉన్నప్పుడు వినపడుతూ ఉంటుంది కాదు హెన్రీ!"

"నీకు చలివేస్తున్న దేమిటి ఎడ్నా?" అన్నాడు ఆత్రంతో హెన్రీ.

"లేదు. లేదు. పట్టలేని ఆనందం పొందుతున్నాను" అంది ఎడ్నా.

హెన్రీ నవ్వుతూ, "మేడమీది పెద్దగది నీకు. ఆగది నీకు సరిపోతుంది కాదూ? అందులో నువ్వాడుకోవడానికి చిన్నచిన్న మచ్చి బొమ్మలున్నాయి. కుర్చీ కూడ ఉందిలే. అందులో కూర్చుని సెగదు వేసుకొని తల దువ్వుకుంటూ ఉంటే సెగదు మంటలో నీవేణి బంగారపు డాకురేకులా తళతళ లాడుతూ ఉంటుంది. అది నేను చూస్తూ ఉంటాను. హాయిగా నువ్వక్కడే కూర్చొని వాలుజడ వేసుకో వచ్చును. నేను క్రింద గదిలో ఉన్న కంబళిమీద పడుకుంటూ. నాకు బద్ధక మెక్కువకూడాను. 'యూఫిమియా'—మనకు పనిచేసేది—పగలేగా ఇక్కడుంటుంది? అది వెళ్లిపోయిన తరువాత మనమిద్దరమూ వంటింట్లోకిపోయి టేబిల్ మీద కూర్చుని ఏయాపిలో తిందాము, లేకపోతే దర్జాగా టీ కాచుకొని, సరదాగా పుచ్చుకుందాము. టీ కాచడమంటే నాకెంతో సరదా. టీ నీళ్లు మరుగుతూంటే వసంతఋతువులోని ఉదయకాలంలా వాటిపాట నాకెంతో ఆనంద మిస్తుంది ఎడ్నా."

"ఔను నాకు తెలుసు. ఆకాలంలో రకరకాల పక్షుల కిలకిలారావములు చెవుల కెంతో ఇంపుగా ఉంటాయికదూ!" అంది ఎడ్నా.

ఇట్లు వీరిద్దరూ భావి ఆనందమయజీవితం గురించి ఊహా ప్రపంచములో తేలిపోతూ ఉంటే ఇంటి కటకటాల్లోంచి రోడ్డు మీదకు ఒకపిల్లి పరుగెత్తుకుని వచ్చింది. ఎడ్నా "కిట్టీ! కిట్టీ!" అని దాన్ని రమ్మని పిలుస్తూ చేతుల క్రిందకు చాపింది. ఆపిల్లికూన అతిచనువుగా ఎడ్నాదగ్గరకు వచ్చి ఆమె కాళ్లను రాసుకోవడం మొదలు పెట్టింది.

హెన్రీ కొంటెతనంగా నవ్వుతూ "మన మింక షికారు వెళ్లి పోదాము. పిల్లిని ఇంట్లో వదలివేద్దాము రా! నాదగ్గర ఇంటితాళం ఉం"దన్నాడు."

ఇద్దరూ రోడ్డు దాటి ఇంటికేసి వెళ్లారు. ఎడ్నా పిల్లిని ఒడిలో పెట్టుకొని ముద్దులాడుతూ నిలబడింది. హెన్రీ గబగబ వెళ్లి మెట్లన్నీ ఎక్కి, హూ! ఇంటితాళం తీసే వాడిలాగే! తలుపుదగ్గర నిలుచున్నాడు.

మళ్లీ గబగబ క్రిందకు దిగి, "ఎడ్నా! ఇంక పద, మనం వెళ్లిపోదాము. ఇంకా ఉంటే మన మింతవరకూ అనుభవించింది ఇంకా ఇంకా వట్టిదై, స్వప్నరూపం పొంది ఆఖరుకి గుడ్డిసున్నా అయిపోతుంది" అన్నాడు హెన్రీ. * * * *

రాత్రి చీకటిగానే ఉంది గాని వెచ్చగా ఉంది. వారి కింటికి వెళ్లడాని కిష్టం పుట్టడం లేదు.

"ఎడ్నా! నాకెల్లా ఉందంటే! ఇప్పుడే వెళ్లి మన మాయింట్లో ఉండిపోవాలని ఉంది. మనమెప్పుడూ వేటికోసం కనుపెట్టుకొని ఉండకూడదు. కాలమేమిటి? అది పసిపాప. ఏక్షణాని కాక్షణమే అదీ మనం కూడ పెద్దవారమవుతున్నాము. నాకనిపిస్తుందిగదా! మనమెప్పుడూ ఏదైనా పొందాలంటే అనుకూలమైన పరిస్థితులకోసం, చిక్కే అవకాశం కోసం వేచియుండకూడదని. ఎప్పటికో పొందుతామని దానికోసం కనుపెట్టుకుంటే కాలాంతమువరకూ కనుపెట్టుకుని ఉండడమే అయిపోతుంది. నువ్వు పొందాలన్న వస్తువుకోసం కాలంకన్న ముందు పరుగెత్తి దాన్ని ముంగురులు పట్టుకుని లాక్కొని వచ్చి సంపాదించుకోవాలి గాని గ్రుక్కిళ్లు

ముంగుకుంటూ కను పెట్టుకొని ఉండకూడదు. అంతేనా? నిజమేనా?"

"కాని హెన్రీ! డబ్బో? మనం డబ్బు చూసుకోవాలిగదా మరి!" అంది ఎడ్నా.

"ఛా! డబ్బు కేమి. డబ్బులో ఏముంది డబ్బు వస్తుంది, పోతుంది. ధనం చాల చంచలం. మన కేమి కావాలంటే అవి వాటంతట అవే వస్తవి. పోనీ! రాకపోతే. మనకి బెంగే లేదుగా!" అన్నాడు హెన్రీ.

అత నన్నదాని కామె సమాధాన మీయలేదు. ఆకాశంకేసి చూస్తూ, "అబ్బా! నాకీ ప్రదేశం వదలి ఇంటికి పోవాలని లేదు బాబూ" అంది.

"నిజంగా నాకూ అల్లాగే అనిపిస్తోంది. మనం ఎల్లాగైనా సరే ఇక్కడనుంచి కదలవద్దు. అయ్యో! ఈ పాటికి మనం ఇంట్లోకి వెళ్లి, పనపిల్లికి చిన్న పళ్లెమొకటి వెతికి పాలకుండలో మిగిలిపోయిన మీగడతరకలు దానికి పెట్టవలసిందే! నాకు నవ్వు రావడంలేదు ఎడ్నా! నాకిప్పుడు సుఖంగాకూడ లేదు. నీ కోసం బెంగగా వుంది. ఎడ్నా! ఒకసారి మనసారగా నాతల నీ ఒడిలో పెట్టుకోనివ్వవూ? కావలిస్తే నీ చెక్కిలి నాజుట్టులో దాచుకో. అబ్బా! ఒకసారి మనసారగా ఏడ్చివేయనియ్యి" అన్నాడు హెన్రీ నింపాదిగా.

"కాని హెన్రీ" అంటూ నింపాదిగా హెన్రీ దగ్గరగా వచ్చి, "నేనంటే నీకు నమ్మకం లేదూ? మనకి తప్పకుండా ఒకయిల్లు దొరుకుతుందంటే నమ్మవూ? అప్పుడు మన కేది కావాలంటే అవన్నీ దొరుకుతాయి. ఏమంటావు?" అంది ఎడ్నా.

"ఊహుఁ! అంతేకాదు. అల్లా అంటే నాకు సరిపోదు. నాకు హాయిగా ఆమెట్లమీద కూర్చుని ఇప్పుడే నా కాలిజోళ్లు విప్పుకోవాలనిపిస్తున్నది. ఏమంటావు ఎడ్నా? ఎప్పుడో ఆయింట్లో ఉంటామనే ఆశతో ఎంతకాలం గడపడం బాబూ? నా కల్లా కాదు. ఇప్పుడే కావాలి" అన్నాడు హెన్రీ.

"అయ్యో! మనం చాల చిన్నవాళ్లమై పోయినామే! లేకపోతేనా! ఈపాటికి" అంటూ ఎడ్నా అతనికేసి దీనంగా చూపు సారిస్తూ, "లేదు లేదు. నేను పెద్దదాన్నే. ఇప్పుడు నా కిరవైయొ్యేడు."

౬

హెన్రీ వెల్లికిలా గుబురుగా పెరిగిన చెట్ల ప్రక్కనే ఉన్న పచ్చిక బయల్లో పడుకున్నాడు. ఇటూ అటూ ఒత్తిగిల్లుతూ ఉంటే క్రింద ఉన్న ఎండుటాకులు గలగల చప్పుడు చేస్తూఉన్నవి. లేతసూర్యుని వెలుగులో పైనున్న చెట్లాకులు, ఆకుపచ్చని నీళ్లలా, జలజల స్రవిస్తూ ఉన్నట్టు కనుపిస్తున్నవి. ఎక్కడో హెన్రీదృష్టికి దూరంగా ఎడ్నా పువ్వు లేరుకుంటూ ఉంది. హెన్రీకి ఎందుచేతనో మందకొడి ప్రొద్దున్నుంచీ వదలే లేదు. జోగుతూ, కలలు కంటూ, అల్లాగే పండుకోవడం వల్ల ఎడ్నామల్లే, పువ్వు లేరడంలో ఎంత ఆనందం వుందో తెలుసుకో లేకపోతున్నాడు.

"ఎడ్నా! నీవు పోయిరా! పువ్వులకి - నేను రాలేను. నాకు చాల బద్ధకంగా ఉంది" అన్నాడు.

తన టోపీ క్రింద పారేసి ఒకసారి అతని ప్రక్కనే సాగిలపడి చల్లగా ఆమె వెడలిపోయింది. తోటంతా చాల నిశ్శబ్దంగా ఉంది. కాని మధ్యమధ్యను ఆకుల గలగలతో చప్పుడయ్యేది. హెన్రీ ఎడ్నా ఎంతో దూరంలో లేదని తెలుసుకొని, చల్లగా ఆమె ఉన్న చోటుకు వెళ్లి అక్కడ క్రింద మాంద్యంగా పడుకున్నాడు. అతనికి ఇవ్వేళ లేచినప్పటినుంచీ లేచినట్లే లేదు. మళ్లీ పడుకుంటాడు. మళ్లీ పడుకుంటాడు. ఊరికే అతనికీ వేళ స్వప్నములు తరంగితమవుతున్నాయి. జాగ్రదవస్థలో నుంచి నిద్రావస్థలోకి, నిద్రావస్థలో నుంచి స్వప్నావస్థలోకి అస్తమానమూ అతని ఊహలు బండిచక్రాలవలె పరిభ్రమణ మౌతూనే ఉన్నాయి. కొంతకాలం ఎడ్నాయే అతనికో కలలా అనిపించేది. ఇప్పు డిద్దరూ కూడ కలిసి స్వప్న ప్రాయమైన సుఖమే పొందుతున్నామని అనిపిస్తున్నది. ఇంతలో ఇంకొక స్వప్నం అతన్ని అప్పుడే తన చెరగులోనికి లాగికోవాలని కౄరు చూపు చూస్తూ ఉన్నది.

"కాని నాకు మనం కలలా అనిపించడం లేదు. మనమూ, మన జీవితాలు, మన ఆనందమూ కలే అయినట్టయితే ప్రపంచమే కల అన్నమాట. మనం లేకపోతే ప్రపంచమూ ఉండదు. మన చుట్టూ ఉన్న చెట్లూ చేమలూ, ఆకాశాన్ని పారు పక్షులూ, నీలిమేఘాలూ, ఎల్లాగ మనస్థూల దృష్టికీ సూక్ష్మ దృష్టికీ కూడ సత్యంలా కనబడుతున్నాయో అల్లాగే మన మిద్దరమూ కూడ ఈవిశాల విశ్వంలో నిజం, నిత్యం" అన్నాడు హెన్రీ.

ఎడ్నా లేని రోజులను తనస్మృతిపథములో పెట్టుకొని వాటినిగురించి నిజంగా ఊహించుకొని మనోనేత్రం ఎదుట చూసుకుందామని ఎంత ప్రయత్నించినా చూడలేక పోయాడు. ఆమె వలపుచెరగుతో వాటిని కప్పివేసింది. హెన్రీ ఆమె దివ్యమంగళరూపంతో నిండిపోయాడు. మరి వేటికీ అతనిలో తావు లేదు. అతను ఆమెలో లీనమై పోయినాడు. వ్యక్తిత్వము పోనాడుకున్నాడు. అతను ఆమెను వాయువులా ఆఘ్రాణిస్తున్నాడు. ఆమె సౌందర్యాన్ని తనివి తీర గ్రోలుతున్నాడు. ఆమె ప్రేమనే మృష్టాన్నమూ క్రింద భుజిస్తున్నాడు. నడుస్తూ ఉంటే ఎడ్నా ఒక దివ్యమంగళ కాంతి అయి అతనిలో కలసి అతనికి జ్యోతిఃప్రభ నిస్తూ ఉంది. ప్రపంచమంతా ఎడ్నా వెలుగుతో నిండినట్టుగా కనిపిస్తున్నది. ఏవస్తువును తాకినా. ఎడ్నా స్పర్శమనై దానికి ఉజ్వలత నిస్తున్నది.

"నువ్వు నవ్వేసిన తరువాత చాలసేపటివరకూ నీనవ్వువెన్నెల నాకు చల్లదనం ఇస్తూనే ఉంటుంది. నీనవ్వు కిలకిల నాహృదయ వీణకు పాటలు నేర్పుతూనే ఉంటుంది. ఇటువంటి తీయని అనుభవాలు పొందుతూ ఉన్నప్పుడు కూడా మనం వట్టి కలలమా? మన ప్రేమ, మన జీవితం స్వప్నప్రాయమా? చాల్లే!" అన్నాడు హెన్రీ చాల ఉద్రేకంతో.

ఇంతలో హెన్రీ కళ్ల ఎదుటనే ఎన్నో దృశ్యాలు పెట్టె బొమ్మల్లా ఒకటి తరువాత ఒకటి కనుపడ్డవి: తనూ, ఎడ్నా చిన్నపిల్లల్లా వీథుల్లో నడుస్తూ ఉండడం, కిటికీల్లోనుంచి ఇళ్లల్లోనికి కొంటెతనంగా తొంగిచూడడమూ, దారిలో అమ్మవచ్చే బొమ్మలు కొనుక్కొని వాటితో ఆడుకుంటూ ఉండడమూ, మాట్లాడుతూ పకపక నవ్వుతూ కేరింతాలుకొడుతూ ఉండడమూ—ఇవన్నీ చూసేసి ముఖం త్రిప్పేసి బోర్లా పడుకుని ముఖాన్ని ఆకుల చాలులో దాచివేసికొన్నాడు—ఆరనికోరిక బరువువలన సోలిపోయినట్టుగా – పాపం! హెన్రీకి గట్టిగా ఆమె నెద నెద నదుముకుంటూ, విడని కౌగిలిలో ఇముడ్చుకొని, ఆమె చెక్కిలిని తన ముఖాన్ని చేర్చి, ఊపిరైనా ఆడకుండా ప్రేమచుంబనాలు పెట్టుకుందామని కోరిక.

"అబ్బా! ఇల్లా నా కాకలి దహించుకొని పోతూ ఉంటే నేను మనడం ఎలా?" అంటూ పడుకున్నవాడు హఠాత్తుగా లేచి ఎడ్నా వైపు పరుగెత్తుకొని వెళ్లాడు. ఆమె చాలదూరం వెళ్లిపోయింది పువ్వు లేరుతూ. పచ్చగా ఉన్న పల్ల ప్రదేశంలో ఆమె ముందుకు వంగి పువ్వులు కోస్తూ హెన్రీని చేతులెత్తి పిలుస్తూ, "హెన్రీ! త్వరగా రావాలి. రావాలి. చూడు ఎంత అందంగా ఉన్నాయో! నేనెప్పుడూ ఇటువంటి పువ్వులు చూడలేదు. రా" అన్నది.

ఆమెను చేరుకున్నాడు. తన ఆత్రంలో ఆమెను కౌగిలించుకొని ఆమె ఆనందాన్ని భగ్నం చేయడం ఇష్టం లేక కొంచెం వెనక్కు తగ్గి నిలుచున్నాడు. ఎడ్నా ఎంత వింతగా ఉంది! మాట్లాడుతూ ఉన్నంతసేపూ ఆమె నేత్రములు నవ్వువెన్నెలలు చిలుకుతూనే ఉన్నాయి. ఆనవ్వు తన్ను చూసి వెక్కిరిస్తూ ఉన్నట్టున్నది హెన్రీకి. పాలబిళ్లల్లా ఉన్నాయి ఆమె చెక్కిళ్లు.

"నా కేమీ ఆయాసంగా లేనుసుమీ! నా కంతులేకుండా ప్రపంచయాత్ర చేసివేయాలని ఉంది. హెన్రీ! నడు. చరచరా నడు హెన్రీ! హెన్రీ! నేను నడుస్తూ నడుస్తూ పైకెగిరిపోతే, నా కాళ్లు పట్టుకొని నువ్వు క్రిందికి లాగుతావు కదూ? లేకపోతే నేను మళ్లీ క్రిందకు రానుసుమీ! అల్లాగే ఆకాశంమీది కెగిరిపోతాను. ఓహో! నాకీవేళ ఎంతో ఆనందంగా ఉంది హెన్రీ! అబ్బ! ఈపట్టరాని ఆనందంవల్ల నే కాబోలు, కొంత భయం కూడ కలుగుతున్నది హెన్రీ!" అని ఎడ్నా చెప్పుతూ ఉండగానే ఇద్దరూ రెల్లుదుబ్బులు దట్టంగా పెరిగిన ప్రదేశాన్ని

చేరుకున్నారు. మధ్యాహ్నము కావస్తున్నది. సూర్యుడు తీక్ష్ణంగా లేడు. గాలి చల్లగానే వీస్తున్నది.

"ఇక్కడ కాసేపు కూర్చుందామా?" అంటూ ఎడ్నా గుబురుగా పెరిగిన కల్లుడుబ్బుల్లోనుంచి ఈదుకుంటూ పోయి మెత్తని ప్రదేశంమీద మేను వాల్చింది.

"హెన్రీ! ఈప్రదేశము ఎంతహాయిగా ఉంది. ఆకాశమూ, ఎగురుతూఉన్న చిన్న పక్షులూ తప్ప మరేమీ కనపడడం లేదు." అంది ఎడ్నా.

హెన్రీకూడ ఆమెప్రక్కనే వాలి ఆమె పూల సజ్జలో ఉన్నపువ్వులు ఎడ్నా మెడకు సరిపోయేటట్టుగా ఒకహారం గ్రుచ్చాడు.

"నాకు నిద్రవస్తున్నది బాబూ!" అంటూ ఎడ్నా నింపాదిగా హెన్రీకాళ్లవైపు ప్రాకుచూవేణికతో ముగాన్ని కప్పుకొని అతని ప్రక్కను పడుకుంది.

"హెన్రీ! ఇక్కడ మనం ఉండడం నిశ్శబ్దవాటిలో ఉన్నట్టుగా ఉంది. చాల హాయిగా ఉన్నది కదూ!" అంది.

"ఔను నిజంగా అల్లాగే ఉన్నది" అన్నాడు హెన్రీ అస్పష్టంగా.

"నిన్నొక దేవిని చేసి నాప్రేమవేదికపై ప్రతిష్ఠించుకుంటాను ఎడ్నా" అని హెన్రీ అంటూంటే ఎడ్నా లేచి కూర్చుని, "లోపలికి వెళ్లుదాము, రా" అంది.

మళ్లీ రోడ్డెక్కి చాలదూరం నడిచారు ఇద్దరూ. ఎడ్నా ఆగి, "అబ్బా! నే నింక ఈప్రపంచయాత్ర సాగించలేను. నాకాళ్లు సాగిపోయినాయి. నే నలిసిపోయినాను" అంటూనే రోడ్డు అంచునున్న పచ్చగడ్డిమీద కాళ్లీడ్చుకుంటూ నడుస్తూ, "నువ్వు, నేనూకూడ అలసిపోయినాము. ఇంకా ఎంత దూరం" అంది. రోడ్డుకేసి కంటిచూపు ఆనేవరకూ చూస్తూ, "ఏమో నాకు తెలియదు కాని వచ్చివేశాము ఆట్టే దూరం లేదులే" అన్నాడు హెన్రీ. ఇద్దరూ మాటా పలుకూ లేకుండా మరికొంతదూరం నడిచారు.

ఆఖరికి విసుగుతో ఎడ్నా, "అబ్బా! ఇంకా చాలాదూరం ఉంది. నాకు కాళ్లు పీకుతున్నవి. పైగా ఆకలి దహించి వేస్తూఉంది. ఈపూల సజ్జను నువ్వుపట్టుకుందూ" అంది. హెన్రీ ఆమెకేసి చూడకుండానే ఆసజ్జ ఆమెచేతిలోంచి తీసుకున్నాడు.

చివరకి ఒకపల్లె చేరుకున్నారు. ఒక పూరింటి గుమ్మానికి "టీ యివ్వబడును" అనే బల్ల కట్టి ఉంది.

"ఇదే నేను అనుకున్నది. ఇక్కడికి నేచాలాసార్లు వచ్చాను. ఆచిన్న బల్లమీద కూర్చో. నేను లోపలికి పోయి టీ తెమ్మని చెప్తాను" అన్నాడు హెన్రీ.

ఆమె పాపము అలపు తీర్చుకుంటూ బల్లమీద కూర్చుని చుట్టూ ఉన్న తోటలోని తెల్లని, పచ్చని, పువ్వులకేసి చూడసాగింది.

ఒక స్త్రీ ఎవరో వచ్చి గుమ్మానికి జేర్లబడి వీరిరువురూ ఫలహారం చేస్తూఉంటే చూస్తూ నిలుచుంది.

హెన్రీ ఆమెను ఏవో కొన్ని కుశలప్రశ్నలు వేసి మంచివాడనిపించుకున్నాడు. కాని ఎడ్నా మాత్రం ఆమెతో ఒకపలుకైనా ఆడలేదు.

"మూగనోము పట్టినావా ఏమిటమ్మా. పలుకే బంగారమా?" అందామె, ఎడ్నాను పలుకరిస్తూ.

"లేదమ్మా. ఈతోట ఎంతో అందంగా ఉంది! దీనికేసి చూస్తున్నాను" అంది ఎడ్నా.

"బాగుందీ!" అంటూ హెన్రీకేసి చూసి, "ఆమె మీ చెల్లెలా?" అందామె.

"ఔను." అని తలూపుతూ హెన్రీ, హల్వా నోటిలో వేసుకున్నాడు.

"ఔను. ఇద్దరికీ పోలిక ఉంది" అంటూ ఆమె తోటలోకి పోయి నాలుగు తెల్ల గులాబి పువ్వులు కోసుకొని వచ్చి ఎడ్నా కందిచ్చింది.

"మాకు తెలియదు కాని, అయినా మీరెయెరుకను యిల్లు కావలిసిన వాళ్లుంటే చెప్తారా? మాచెల్లికి జబ్బు చెయ్యడంవల్ల, ఇల్లు వదిలివేసి ఆమె వెళ్లిపోయింది. దాన్ని అద్దెకిచ్చివేయాలని చూస్తున్నాను" అందామె.

"చాలాకాలం ఉండాలా అండీ?" అని చాల మర్యాదగా ఆమె నడిగాడు హెన్రీ.

"అది ఉండేవాళ్లను బట్టి చెప్తాను" అన్నదామె నసుగుతూ.

"సరే! నా కెవరైనా తెలిసినవా రుంటారులెండి! మన మొకసారి వెళ్లి ఇల్లు ఉద్దామా?" అన్నాడు హెన్రీ.

"ఓ. అల్లాగే. దాని కేమి! ఎంతో దూరం లేదు. ఆ వీధిలో చెట్లు కనబడుతున్నాయే, అయిల్లే. రెండడుగుల దూరం. తాళం పట్టుకుని వస్తానుండండి" అంటూ ఆమె లోనికి పోయింది.

హెన్రీ ఎడ్నాతో, "నువ్వూ వస్తావా?" అంటే ఆమె "సరే. పద" అంది.

వారందరూ రోడ్డెక్కి గేటు దాటి ఇటూ అటూ చెట్లున్న గడ్డిదారిమీదుగా ఆయిల్లు చేరారు. అది చాల చిన్న ఇల్లు—క్రింద రెండు, మేడమీద రెండూ, గదులున్నాయి.

ఎడ్నా మేడమీదిగది కిటికీలోనుండి క్రిందకు చూస్తూ ఉంది. హెన్రీ క్రింద వీధిగుమ్మందగ్గర నిలుచుని "ఎల్లా ఉంది: నీకు నచ్చిందా?" అన్నాడు.

"చాలా బాగాఉంది. ఇల్లా రా. ఇక్కడనుంచి చూడు, ఎంత బాగా ఉందో!" అంటూ అతన్ని పైకి రమ్మని పిలిచి కిటికీలో తనో ప్రక్కకు జరిగి అతనికికూడ చోటు చేసింది. హెన్రీ పైక వచ్చి కిటికీలోనుంచి అవతలికి వంగిచుట్టూ ఉన్న ప్రదేశాన్ని చూస్తున్నాడు. వారికి క్రిందుగా సన్నగాలికి తలలు పంకిస్తూ చెట్లున్నాయి. ఈసన్నగాలికే ఎడ్నా ముంగురు లెగిరి హెన్రీకళ్ల మీద పడ్డాయి. వాళ్లిద్దరూ అక్కడనుంచి కదల్లేదు. అది సాయంసమయము. ఆకాశపు నీలాల్లోనుంచి నక్షత్రాలు కుసుమిస్తున్నాయి.

"చూడు! చూడు! అవిగో నక్షత్రాలు" అంటూ ఎడ్నా కదలనట్టు కనపడుతూనే నింపాదిగా హెన్రీ భుజముమీద వాలింది. అతనామెను ఒక చేతితో దగ్గరకు తీసుకున్నాడు. "క్రింద కనబడుతూఉన్న ఏన్నీ ఏంచెట్లు" అని డగ్గుత్తికతో ఆమె అడిగింది.

"ఈ కనుచీకటి మనలని మోసపుచ్చడంచేత అవేవో చెట్లలా కనుపడ్డవి. కాని కొన్నిచెట్లనిండా దేవతలున్నారు, మరికొన్నిచెట్లనిండా చక్కబాదంకాయలున్నాయి" అని కొంటెగానంగా హెన్రీ అనడంతోనే ఎడ్నా నిట్టూర్చి, "ఇంక మనం ఇక్కడ ఉండవద్దు. వెళ్లిపోదాము రా బాబూ!" అంది.

హెన్రీ ఆమెను తన బాహుబంధంలో నుంచి విడుదలచేశాడు. ఆమె ఆగదిలోనే నడాముతూ చెదరిన జుట్టు పైకి తీసుకుంది.

"ఏమి! ఈవేళంతా నువ్వల్లా ఉన్నావే!" అని హెన్రీని ప్రశ్నించి అతనిసమాధానంకోసం ఆగకుండగనే అతనిచెంతకు పరుగున వెళ్లి కంఠమాలగా తనబాహువులు వేసి అతనిశిరము తనయెద కదుముకున్నది.

ఉద్రిక్త హృదయంతో, "హెన్రీ! నిన్నే ప్రేమించాను. అబ్బా! నన్ను గట్టిగా అదిమి పట్టుకుందూ" అన్నదామె.

హెన్రీ ఆమెను తన కౌగిలిలో అదుముకున్నాడు. ఆమె అతనిమీద ఆనుకొని అతని కన్నుల్లో కనులుపెట్టి చూస్తూ "ఈవేళంతా ఎంత దారుణంగా ఉంది? దీనికంతకూ కారణం నాకు తెలుసును. నేనెన్నో విధాల ప్రయత్నం చేశాను: నీకు చెప్పివేద్దామని—నువ్వు నన్ను ముద్దుపెట్టుకోవడం నాకెంతో ఇష్టమని—అబ్బ! ఎన్నిసార్లు! ఎన్నిసార్లు!" అన్నది.

"ఎడ్నా! నువ్వు ధన్యావు. ధన్యావు ధన్యావు. ముమ్మాటికి ధన్యావు" అన్నాడు హెన్రీ ఆమె కన్నుల లోనికి చూస్తూ.

౨

"సాయంకాలమువరకూ ఎల్లా లేచి ఉండగలనా అనుకుంటున్నాను" అన్నాడు హెన్రీ.

జేబులోనుంచి గడియారం తీసి గదిలోకి పోయి పుష్పపాత్రిక పట్టుపై పెట్టాడు. టైమెంతయిందో అని గడియారం కేసి ఏడుసార్లు చూచాడు కాని సరిగా ఎంతటైమయిందో అతనికి జ్ఞాపకమే లేదు. మళ్లీ చూశాడు.

నాలుగున్నర అయింది. ఆమె బండి ఏడుగంటలకి వస్తుంది. స్టేషనుకి ఆరున్నరకే బయలుదేరి పోవాలి. ఇంక రెండు గంటల కాలం గడపాలి గదా!

మేడపైనుండి క్రిందకీ, క్రిందనుండి పైకీ మెట్లు దిగుతూ ఎక్కుతూ, "ఇది చాల సరదాగా ఉంది" అనుకున్నాడు. తోటలోనికి పోయి తెల్లపువ్వులన్నీ చెండుక్రింద కట్టి ఎడ్నా మంచం ప్రక్క ఉన్న పువ్వు పాత్రికలో పెట్టి హెన్రీ భావ ప్రపంచంలో ఎటకో తేలిపోతున్నాడు.

"ఇల్లాం కాలం వెళ్లబుచ్చడం చాల విసుగుగా ఉంది. ఛా! ఈపని బాగా లేదు......ఆమె మరింక రెండు గంటల్లో వస్తుంది. ఇద్దరమూ కలిసి కులాసాగా ఇంటికి నడచి వచ్చివేస్తాం. నేను ఆపళంగా వంటింట్లో టేబిలు మీద ఉన్న తెల్లజాడీ పట్టుకొని పాల 'బిడ్డీ' యింటికి వెళ్లి పాలు పట్టుకొని తిరిగి వస్తాను. నేను వచ్చేటప్పటికి ఆమె వంటింట్లో దీపారాధన చేసి సిద్ధంగా ఉంటుంది. పిల్లిలా ఇంట్లోకి వచ్చి కిటికీలోనుంచి దీపం వెలుగులో ఆమె ఇటూ అటూ వంటింట్లో తచ్చాడడం చూస్తాను. తరువాత భోజనం చేస్తాము. భోజనం అయినతరువాత (గిన్నెలన్నీ నేనే కడిగి వేస్తాను!) నెగడుకి మరి నాలుగు పుల్లలు పెట్టి ఇద్దరమూ ప్రక్కమీద కూర్చుని అవి మండుతూఉంటే చూస్తూఉంటాము. అంతా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుంది—నిప్పు కర్రల చిటపెట ధ్వనీ, తొంగితొంగి చూస్తూఉండే మలయ కుమారికల కాలిచప్పుళ్లు తప్ప......తరువాత మేము మాకొవ్వొత్తి దీపాలు మార్చుకుంటాము. ఆమె ముందు పైకి వెళుతుంది. గోడమీద ఆమె నీలినీడ పడుతూ ఉండగా పైకివెళ్లి పోతూ 'గుడ్‌నైట్ హెన్రీ!' అంటే నేను 'గుడ్‌నైట్ ఎడ్నా!' అంటాను. తరువాత ను మేడమెట్లు దబదబ చప్పుడు చేస్తూ నామంచం మీదకురికి, ఆమెగది తలుపుల సందులోనుంచి నాగదిలోపడే వెలుతురు పీలిక కేసి అది కనపడేదాకా చూస్తూ అది ఆరిపోయినతరువాత కళ్లు మూసివేసుకొని ప్రొద్దున్నదాక పడుకునే ఉంటాను. ఇంక మాకు రేపు, రేపురాత్రి ఉంటాయి. నాలాగే అనుకుంటూ ఉంటూన్నదా ఎడ్నాకూడా? ఎడ్నా! త్వరగా రా!

నాకే చిన్న రెక్కలుంటే
నేనే చిన్న పులుగునైతే
రివ్వురివ్వున వచ్చి
నీ క్రోల వ్రాలనా!

వద్దు వద్దు ఎడ్నా!......ఇల్లాగే ఉండాలి. నిరీక్షణ నే స్వర్గసౌఖ్యమంది ఎడ్నా! నీకర్థమయినదా నేనన్నది? ఎప్పుడైనా చిన్నపూరింట్లో ఇంత అమృతం లాంటి జీవితం గడిపినవారిని ఎవరినైనా నువ్వెరుగుదువా? చూడు! మనం ఎల్లా ఉన్నామో!

హెన్రీ క్రింద గుమ్మంలో కూర్చున్నాడు, చేతులు రెండూ ముడుచుకున్న మోకాళ్లకు పెనవేసి. ఆరాత్రి వారిద్దరూ ఓడమల్లయ్యాల పల్లె చేరినప్పుడు ఎడ్నా "నేనంటే నమ్మకం లేదు హెన్రీ?" అంది.

"అప్పుడు లేదు కాని ఇప్పుడు ఉంది. 'పరమాత్మోహం పరిపూర్ణోహం' అని పిస్తున్నది నాకు నేనే" అన్నాడు హెన్రీ.

హెన్రీ తల గుమ్మంమీదకు వాల్చాడు. నేత్రాలు—నిద్రమత్తువల్ల మాత్రం కాదు. ఎందుచేతనో, మూతలు పడిపోతున్నాయి. అల్లా చాలాకాలం గడచిపోయింది. రోడ్డుమీద పైకి ఎగసిపోతూ పెద్ద తెల్ల పట్టుపురుగొకటి వెళ్తూన్నట్టుగా చూసినట్లు తలపోసుకున్నాడు హెన్రీ. అదివచ్చి ఇంటివీథి గుమ్మంమీదే వాలింది. అది పట్టుపురుగు కాదు. తెల్లగౌను వేసుకున్న చిన్న బాలిక, ఎంత అందమైన పిల్ల! అతను హసిస్తున్నాడు నిద్రలో. ఆమెకూడ నవ్వుతూ వెనక్కి తగ్గుతూ తారుతూ తన అడుగు జాడలు చూసుకుంటూ నడచి వెళ్లి పోయింది.

"కాని ఆమెమాత్రం ఈ ఇంట్లో పిల్ల కాదు. ఈ ఇల్లు మాది. ఇందులోకి ఇంకొకళ్లు రావడమే!—అదుగో! అమె వస్తూ ఉంది" అనుకుంటున్నాడు మళ్లీ హెన్రీ.

ఆమె బాగా అతనిదగ్గరకు వచ్చి గౌనులోనుంచి చేయి పైకి తీసి ఒక టెలిగ్రాము అతని కిచ్చి నవ్వుతూ వెళ్లిపోయింది.

హెన్రీ దానికేసి చూస్తూ, "మంచికాన్కే. ఇది ఉత్తుత్తి బువ్వాలాట వంటిది కాదుగదా! లేకపోతే ఇది లోపల పాము లుండే వాటి వంటిదై విప్పగానే పాములు వచ్చి నాకేసి పడగ లెత్తి చూసి బుస్సలు కొట్టవు గదా!" అనుకొని కలలోనే నవ్వుకుంటూ దాన్ని జాగ్రత్తగా విప్పాడు. "ఇది పట్టిబడ తలు పెట్టిన తెల్ల కాగితం". దాన్ని పైకి విప్పి అల్లా వదిలివేశాడు గాలికి.

ఆతోటలో నీలి నీడలు చాయలు దేరినవి. ఆనీడలన్నీ కలసి చీకటి గూడు కట్టి అందులో ఆఇంటినీ, చెట్లనూ, హెన్రీనీ, టెలిగ్రామునూ దాచివేసినవి. కాని హెన్రీ మాత్రం అక్కడనుంచి కదలలేదు.

మీ రా బా యి

మున్నంగి లక్ష్మీనరసింహశర్మ గారు

ధర నధార్మికతా గ్రీష్మతాప ముడుప-సాధుజన మానసమ్ములఁ జల్లపఱుప
నుర్విసర్వము నూయెల లూఁచుచున్న-గాంధి దేవుని సత్త్వయోగమ్ము మహిమ
నమరనదిఁ బొల్చు బంగారు కమల మట్లు-గగనతలమున వెల్గు నక్షత్రమట్లు
వఱలె నీకర్మభూమిని భాగ్యవశత-సారసదమల మలయసమీర "మీర."
పడమటిసీమయేడ! ధనవంతుని కూరిమి బిడ్డవేడ! చో
ప్పడిన నిజేచ్ఛ యేడ! యెలబ్రాయమదేడ! సమస్త భోగ్యముల్
బిడికిటిలోనివై యనుభవింపఁగ నొల్లమి యేడ! అయ్యో! లే
వడిఁ బరపాలకత్వమున వందురు భారతవర్ష మేడ! క
ట్టిడివిధి యేల యిట్లు వికటించెనో నీయెడ! గోచిపాతరా
యఁడు, చెఱసాలలం జివుకు నష్టదరిద్రుఁడు, గాంధి, ముక్తి నీ
యొకి నిడునంచు నమ్మి యిటు యోగినివై తివె పిచ్చితల్లి, నీ
యడుగులకుం బదింబదిగ నంజలులం ఘటియింతు సోదరీ!